ఎవరిని గెలిపిస్తారో..?

మల్కాజిగిరి లోక్‌సభ పరిధిలో ఓటేసిన 19 లక్షల మంది

- గెలుపోటములను ప్రభావితం చేయనున్న మైనారిటీల ఓట్లు
- మల్కాజ్‌గిరి లోక్‌సభ పరిధిలో సర్వత్రా ఇదే చర్చ
- బీజేపీ, కాంగ్రెస్ మధ్యే ప్రధాన పోటీ అంటున్న రాజకీయ విశ్లేషకులు

నిజాంపేట్: మల్కాజిగిరి పార్లమెంట్ నియోజక వర్గంలో పోటీ పడుతున్న ప్రధాన పార్టీల ముగ్గురు అభ్యర్థుల గెలుపోటములను ముస్లిం ఓటర్లు ప్రభావితం చేయనున్నారనే చర్చ జోరుగా జరుగుతోంది. కాంగ్రెస్ నుంచి సునీతామహేందర్‌రెడ్డి, బీజేపీ నుంచి ఈటల రాజేందర్, బీఆర్ఎస్ నుంచి రాగిడి లక్ష్మా రెడ్డిలు ప్రధానంగా పోటీ పడి ప్రచారం నిర్వహించి ప్రజల మద్దతు పొందేందుకు విశ్వ ప్రయత్నం చేశారు. ఇక్కడ పోటీ ఇద్దరి మధ్యనా లేక ముగ్గురి మధ్యనా అనే దానిపై రాజకీయ విశ్లేషకులు రకరకాల విశ్లేషణలు చేస్తున్నారు. బీజేపీ, కాంగ్రెస్ పార్టీల మధ్య ప్రధాన పోటీ ఉందని కొందరు లేదు ముగ్గురు మధ్య పోటీ ఉంటుందని ఇంకొందరు అంటున్నారు. ఎక్కడ చూసినా ఇదే చర్చ జరగడం మల్కాజిగిరి లోక్‌సభ పరిధిలో హాట్ టాపిక్‌గా మారింది.

◆ దేశంలోనే అత్యంత ఎక్కువగా ఓటర్లు ఉన్న లోక్‌సభ స్థానం మల్కాజిగిరి కావడంతో ఇక్కడి ఎన్నికపై సర్వత్ర ఉత్కంఠ నెలకొంది. ఈ నియోజకవర్గంలో సుమారు 38 లక్షల ఓటర్లు ఉన్నారు. ఈనెల 13న జరిగిన ఎన్నికల్లో 50 శాతానికి పైగా సుమారు 19 లక్షల మంది తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. మరి ఈ పోలైన ఓట్లలో ఎవరు ఎక్కువగా ఓట్లు సాధిస్తారో అనే లెక్కలు మాత్రం అన్ని పార్టీల నాయకులు, కార్యకర్తలను ఆందోళనకు గురిచేస్తున్నాయి.

బీఆర్ఎస్‌కు నాటి ఆదరణ లభించేనా..?

◆ బీఆర్ఎస్ పార్టీకి అంసెంబ్లీ ఎన్నికల్లో గ్రేటర్ పరిధిలో ప్రజలు బ్రహ్మరథం పట్టారు. కాంగ్రెస్, బీజేపీలను కాదని బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యేలను గెలిపించారు. మల్కాజిగిరి లోక్‌సభ స్థానంలోని అన్ని నియోజకవర్గాల్లో బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యేలే గెలుపొందారు. మరి ప్రస్తుతం మారి రాజకీయ పరిస్థితుల నేపథ్యంలో ప్రజలు బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థికి పట్టం కడతారా? లేదా? అనేది తేలాల్సి ఉంది.

పోల్ మేనేజ్‌మెంట్‌లో పోటీ పడ్డా కాంగ్రెస్, బీజేపీలు..

◆ ఎన్నికల ప్రచారం ఒక ఎత్తు కాగా పోల్ మేనేజ్‌మెంట్ మరో ఎత్తు ఈ ఎత్తులో పై చేయి సాధించేందుకు కాంగ్రెస్, బీజేపీలు తీవ్రంగా పోటీపడ్డాయి. లోక్ సభ పరిధిలోని అన్ని నియోజకవర్గాల్లోని బస్తీలపై కాంగ్రెస్ పూర్తిస్థాయి దృష్టి సారించి పోల్ మేనేజ్‌మెంట్ చేయడంలో బీజేపీ కంటే ఒక అడుగు ముందు ఉన్నట్లు తెలుస్తోంది. బీజేపీ సైతం కాంగ్రెస్‌తో పోటీపడి తన వంతు ప్రయత్నం తీవ్రంగానే చేసింది. బీఆర్ఎస్ మాత్రం కాంగ్రెస్, బీజేపీల తరువాత నిలిచిందని చెప్పవచ్చు.

బీజేపీ అభ్యర్థి ఈటల వైపు మొగ్గు..!

◆ మల్కాజిగిరి నుంచి బీజేపీ నుంచి ఎంపీగా పోటీ చేస్తున్న ఈటల రాజేందర్ వైపు ప్రజల మొగ్గు చూపారా అనేది మాత్రం అంతు చిక్కడం లేదు. కొంత సానుకూలత అయితే ప్రజల నుంచి లభించినట్లు కనిపించింది. మరి ఆ సానుకూలత ఓట్ల రూపంలో మళ్లిందా లేదా? అనేది చూడాలి. అపార్ట్‌మెంట్‌లు, గేటెడ్ కమ్యూనిటీ, ఉత్తర భారతీయులు, క్లాస్ ఓటర్లపై బీజేపీ ఆశలు పెట్టుకుంది. అదే విధంగా యువత సైతం బీజేపీకే ఓటు వేశారని అంచనాలో ఆ పార్టీ నాయకులు ఉన్నారు.

సీమాంధ్రులు ఓటేయకపోవడం ఎవరికి నష్టం.. ఎవరికి లాభం..?

◆ ఈ నెల 13న తెలంగాణతో పాటు ఆంధ్రప్రదేశ్‌లో సైతం ఎన్నికలు ఉండటంతో మల్కాజిగిరి లోక్ సభ స్థానంలో నివాసం ఉండే సీమాంధ్ర ప్రజలు ఆంధ్రప్రదేశ్‌లో ఓటు వేసేందుకు వెళ్లారు. ఇక్కడ ఓటు వేయలేదు. ఇలా ఇక్కడ ఓటు వేయకపోవడం వల్ల ఎవరికి నష్టం.. ఎవరికి లాభం అనే అంశంపై అభ్యర్థులతో పాటు నాయకులను తీవ్ర ఆందోళనకు గురిచేస్తోంది. వెళ్లిన వారంతా బీజేపీకి ఓటు వేసే వారని కాంగ్రెస్ వారు భావిస్తున్నారు. బీఆర్ఎస్‌కు వేసేవారని బీజేపీ వారు భావిస్తున్నారు.



మైనారిటీల ఓట్లు ఏ పార్టీకి..?

◆ మల్కాజిగిరి పార్లమెంట్ నియోజకవర్గంలో కేవలం ముస్లిం ఓట్లు సుమారు 5 నుంచి 6 లక్షల వరకు ఉంటాయనేది అంచనా. ముస్లిం ఓటర్లు బీజేపీకి వ్యతిరేకంగా కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీల్లో ఏవరి వైపు మొగ్గు చూపరనేది ప్రస్తుతానికి చర్చ జరుగుతుంది. అయితే ఎంఐఎం అధినేత సైతం లోక్‌సభ ఎన్నికల్లో ముస్లింలు అందరు హైదరాబాద్ లోక్‌సభ స్థానం మినహా అంతటా కాంగ్రెస్‌కు ఓటు వేయాలని చెప్పిన విషయంపై తీవ్రంగా చర్చ జరుగుతోంది.

◆ ముస్లిం వంద శాతం బీజేపీకి వ్యతిరేకంగానే ఓటు వేశారని అందులో మెజార్టీ కాంగ్రెస్ పార్టీకే ఓట్లు వేసి ఉండొచ్చని... .ఇక క్రిష్టియన్ ఓటర్లు సైతం బీజేపీకి వ్యతిరేకంగానే ఉండొచ్చని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. క్రిస్టియన్ ఓటర్లు సైతం మల్కాజిగిరి ఎంపీ స్థానం పరిధిలో 3 నుంచి 4 లక్షల మధ్యలో ఉంటారని క్రిష్టియన్ సంఘాలు పేర్కొంటున్నాయి.

◆ ముస్లిం, క్రిష్టియన్ ఓటర్లలో ఎంత మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నరనేది సైతం ప్రధాన అంశం. అదే విధంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఎన్నికల ప్రచారంలో భాగంగా బీజేపీ కేంద్రంలో అధికారంలోకి వస్తే రాజ్యాంగాన్ని రద్దు చేస్తారని. రిజర్వేషన్లు తొలగిస్తారని విస్తృతంగా ప్రచారం చేశారు. అయితే ఏ వర్గం ఓటర్లు ఏ పార్టీని ఆదరించారనేది ఎన్నికల ఫలితాల రోజు తేలాల్సి ఉంది.



ప్రజలకు భద్రత ఇవ్వాల్సిన అవసరం ఉంది

కార్పొరేటర్ ముద్దం నర్సింహయాదవ్

ఓల్డ్‌బోయిన్‌పల్లి: బస్తీలు, కాలనీల్లో ప్రజలకు భద్రత ఇవ్వాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఓల్డ్‌బోయిన్‌పల్లి కార్పొరేటర్ ముద్దం నర్సింహయాదవ్ అన్నారు. ఆదివారం నాగిరెడ్డికాలనీలో తన సొంత నిధులను వెచ్చించి ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను ఆయన ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... కాలనీలలోకి ఇటీవల కాలంలో వాహనాలకు నంబర్ ప్లేట్ల్ లేకుండా తిరుగుతున్నాయని వాటిని సీసీ కెమెరాల్లో గుర్తించి పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. ఇప్పటి నుంచి కాలనీల్లో వచ్చిపోయే వారిపై నిఘా ఉంటుందన్నారు. ఒక్క సీసీ కెమెరా వంద మందితో సమానమని అన్నారు. ఏ సమస్య ఉన్నా తన దృష్టికి తెవాలన్నారు. ఈ కార్యక్రమంలో కాలనీ ప్రతినిధులు హరీష్, మధుపిలై, డాక్టర్ సావిత్రి, రామకృష్ణ, మధుసూదన్, చంద్రకళ, లతా, రమాదేవి, శ్రీనివాసులు, కుమార్, నర్సింగ్ తదితరులు పాల్గొన్నారు.



నాగిరెడ్డి కాలనీలో సీసీ కెమెరాలను ప్రారంభిస్తున్న కార్పొరేటర్ ముద్దం నర్సింహయాదవ్



సొంత డబ్బులతో కెమెరాలు ఏర్పాటు చేయడంతో కార్పొరేటర్‌కు సన్మానిస్తున్న కాలనీవాసులు

'నెలల తరబడి మురుగు పారుతోంది'

ఆల్విన్‌కాలనీ: హైదర్‌నగర్ డివిజన్ పరిధిలోని శ్రీనివాస్‌నగర్‌లో అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ ఏరులై పారుతోందని.. దుర్వాసనతో బాటు ఈగలు, దోమలు వృద్ధి చెందుతున్నాయని స్థానికులు వాపోయారు. నెలల తరబడి రహదారులపై మురుగునీరు పారుతుండటంతో నడవలేని పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వర్షాలు కురుస్తుండడంతో వ్యాధులు ప్రబలే ఆస్కారం ఉందని సమస్య గురించి అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవటం లేదని తెలిపారు. ప్రజా ప్రతినిధులు, ఉన్నతాధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు.







శ్రీనివాసనగర్‌లోని రోడ్లపై పారుతున్న మురుగు

ప్రజలు సుఖ సంతోషాలతో జీవించాలి



పూజలో ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

కూకట్‌పల్లి: కేపీహెచ్‌బీ కాలనీ 6వ ఫేజులోని ఉమారామలింగేశ్వరస్వామి దేవాలయ ద్వితీయ వార్షికోత్సవం ఆదివారం జరిగింది. కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, కార్పొరేటర్ మండడి శ్రీనివాసరావు స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. ప్రజలందరూ సుఖ సంతోషాలతో జీవించాలని కోరుకున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. ఈ కార్యక్రమంలో కోఆర్డినేటర్ సతీష్ అరోరా పాల్గొన్నారు.

21 నుంచి లక్ష్మీనృసింహస్వామి కల్యాణ మహోత్సవం

కూకట్‌పల్లి: ఆల్విన్‌కాలనీ తులసీనగర్‌లోని లీలా క్షేత్రంలోని లక్ష్మీనృసింహస్వామి కల్యాణ మహోత్సవం ఈనెల 21 నుంచి ప్రారంభం కానుందని ఆలయ ఫౌండర్, చైర్మన్ మాధవరం కాంతారావు తెలిపారు. భక్తులందరూ పాల్గొని స్వామివారి కృపకు పాత్రులకావాలని కోరారు.

మార్షల్ ఆర్ట్స్‌తో ఆరోగ్యం, వ్యక్తిగత రక్షణ



బెల్ట్ టెస్ట్‌లో పాల్గొన్న విద్యార్థులు,నిర్వాహకులు

మోతీనగర్: మోతీనగర్, పాండురంగనగర్ కాలనీలోని మినీహాల్‌లో ఆదివారం కుంగ్‌ఫూ మార్షల్ ఆర్ట్స్ అకాడమీ సీనియర్ మాస్టర్ శ్రీనివాస్ ఆధ్వర్యంలో జరిగిన బెల్ట్ టెస్ట్ కార్యక్రమంలో గ్రాండ్ మాస్టర్ డి.కంటేష్ మాస్టర్ పాల్గొని విద్యార్థులకు బెల్టులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా మాస్టర్ శ్రీనివాస్ మాట్లాడుతూ.. ఈ రోజుల్లో ఆరోగ్యపరంగా, వ్యక్తిగత రక్షణకు మార్షల్ ఆర్ట్స్ నేర్చుకోవటం ఉత్తమమని అన్నారు. ముఖ్యంగా విద్యార్థినులకు వ్యక్తిగత రక్షణ చాలా ముఖ్యమని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాస్టర్ భాష, మాస్టర్ వంశీకృష్ణ, మాస్టర్ కుమార్‌లు పాల్గొన్నారు.

సుందరయ్య ఆశయాలను ముందుకు తీసుకెళ్దాం

బాలానగర్: పుచ్చలపల్లి సుందరయ్య ఆశయాలను ముందుకు తీసుకెళ్దామని కూకట్‌పల్లి మండల సీపీఎం కార్యదర్శి ఎం. శంకర్ అన్నారు. పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతిని ఆదివారం శ్రీశ్రీనగర్‌లోని సీఐటీయూ కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన సుందరయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటాన్ని ముందుండి నడిపిన యోధుడన్నారు. సుందరయ్య తెలుగునాట కమ్యూనిస్టు ఉద్యమ నిర్మాతల్లో ఒకరని తెలిపారు. ఎప్పుడు ప్రజల్లో ఉంటూ ప్రజా సమస్యలపై అలుపెరుగని పోరాటాలు చేశారన్నారు. పార్లమెంట్‌లో కూడా ప్రజా సమస్యలపై అనేక ఉద్యమాలు నడిపారని గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు కె. కృష్ణ నాయక్, రాజులు, తాజుద్దీన్, రాములు, నరసింహ, రమేష్, కనకమ్మ, వసంత, ఉపేంద్ర, బాల్‌రాజ్ తదితరులు పాల్గొన్నారు.



శ్రీశ్రీనగర్‌లోని సీఐటీయూ కార్యాలయంలో నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు

ఆత్మస్థైర్యం కోల్పోకుండా ఎన్నికల్లో పనిచేశారు



ప్రేమ్‌నగర్‌కు చెందిన బీఆర్ఎస్ కార్యకర్తలతో శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ

ఆల్విన్‌కాలనీ: లోక్‌సభ ఎన్నికలు ముగిసిన నేపథ్యంలో ఆదివారం కొండాపూర్ డివిజన్ పరిధిలోని ప్రేమ్‌నగర్‌కు చెందిన బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరెకపూడి గాంధీని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గాంధీ మాట్లాడుతూ... అధికారం కోల్పోయినా నిజమైన నిఖార్సయిన పార్ట కార్యకర్తలు ఆత్మస్థైర్యం కోల్పోకుండా ప్రచారం చేయడం అభినందనీయమని అన్నారు. పదేళ్ల కాలంలో అమలైన సంక్షేమ పథకాలను ప్రతి గడపకు తీసుకెళ్లటంతో పాటు ఓటర్లను చైతన్య పరచటంలో పార్టీ శ్రేణుల కృషి స్ఫూర్తిదాయకమని అన్నారు. కార్యకర్తలే పార్టీకి బలమని గులాబీ సైనికులు మరోసారి ఈ ఎన్నికల ద్వారా నిరూపించారన్నారు. భవిష్యత్తులో కూడా ఇదేస్ఫూర్తిని కొనసాగించాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు సత్యం గౌడ్, శ్రీనివాసనాయుడు, మంగలి కృష్ణ, ప్రభాకర్, బాలాచారి, సుభద్ర, కృష్ణాచారి, జనార్దన్, మల్లేష్, భాగ్యలక్ష్మి, పద్మ, షాబుద్దీన్, ఇస్మాయిల్, శివనాయుడు, తదితరులు పాల్గొన్నారు.

బాధితులకు జంతుప్రేమికుల పరామర్శ

రహమత్‌నగర్: బంగారు మైసమ్మ ఆలయం వద్ద జరిగిన దాడిలో గాయపడి వ్యక్తులను జంతు ప్రేమికులు, బస్తీవాసులు ఆదివారం పరామర్శించారు. బంగారు మైసమ్మ ఆలయం వద్ద పెంపుడు కుక్క ఇంట్లో దూరిందని ఈ నెల 14న రాత్రి ధనుంజయ్ తన అనుచరులతో కలిసి శ్రీనాథ్, స్వప్నలతో వారి పెంపడు కుక్కపై విచక్షణారహితంగా దాడి చేసిన సంగతి విదితమే. ఇది సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. దీంతో జంతుప్రేమికులు ఈ ప్రాంతంలో ఆ దోళన సైతం నిర్వహించారు. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడ్డ శ్రీనాథ్, స్వప్నలు చికిత్స అనంతరం ఆదివారం తమ నివాసానికి చేరుకున్నారు. విషయం తెలుసుకున్న జంతు ప్రేమికులు, బస్తీవాసులు వీరిని పరామర్శించేందుకు పెద్ద సంఖ్యలో వీరి నివాసానికి వచ్చారు. అండగా మేముంటాం అంటూ అభయమిచ్చారు. దాడిలో గాయపడ్డ పెంపుడు కుక్క పరిస్థితి విషమంగా ఉందని బాధితులు రోదిస్తూ చెప్పారు.

'మనూ'లో అడ్మిషన్ల ప్రక్రియ షురూ

రాయదుర్గం: మౌలానా ఆజాద్ జాతీయ ఉర్దూ విశ్వవిద్యాలయంలోని ఉర్దూ విభాగంలో పలు కోర్సులకు అడ్మిషన్ల పక్రియ ప్రారంభించినట్లు ఉర్దూ విభాగాధిపతి ప్రొఫెసర్ షంషల్ హోడా ఆదివారం తెలిపారు. కొత్త విద్యాసంవత్సరానికి ఉర్దూ(ఎంఏ)లో 2024–25 అడ్మిషన్లు అందించేందుకు ఏర్పాట్లు చేసినట్లు ఆయన తెలిపారు. ఉర్దూ భాష లేదా మాధ్యమంతో యూజీలో ఏదైనా గ్రాడ్యుయేట్‌లకు ఈ కోర్సుకు అర్హులుగా నిర్ధారించినట్లు పేర్కొన్నారు. మనూ హైదరాబాద్ క్యాంపస్‌లో 50 సీట్లు అందుబాటులో ఉన్నాయన్నారు. ఆసక్తి కలిగిన అభ్యర్థులు యూనివర్సిటీ వెబ్‌సైట్‌లో దరఖాస్తు ఫారం, ఇతర వివరాలు అందుబాటులో ఉన్నాయని, ఆన్‌లైన్‌లో అప్లై చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు ఫోన్ నంబర్ 9494440782లో సంప్రదించాలని ఆయన కోరారు.

శంకరాచార్యులు గొప్ప తత్వవేత్త

చిక్కడపల్లి: ప్రతి జీవిలోనూ దైవత్వాన్ని దర్శించిన ఆది శంకరాచార్యులు గొప్ప తత్వవేత్త అని విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ కాశీ విశ్వేశ్వరరావు అన్నారు. శతాబ్ది పూర్వ మహనీయుల యాది కార్యక్రమంలో ఆదివారం శ్రీ త్యాగరాయ గానసభలోని కళావెంకట దీక్షితులు కళావేదికపై శంకరాచార్య సంస్మరణ కార్యక్రమం గానసభ అధ్యక్షుడు కళా వీఎస్ జనార్ధనమూర్తి అధ్యక్షతన జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్న జస్టిస్ కాశీ విశ్వేశ్వర్ రావు మాట్లాడుతూ ఎనిమిదేళ్ల వయసులోనే సన్యాసం స్వీకరించి వేదాలకు భాష్యాలు చెప్పారని పేర్కొన్నారు.

25న అన్నమయ్య జయంతి

నల్లకుంట: శ్రీసాయి శృతి మ్యూజిక్ అకాడమీ ఆధ్వర్యంలో ఈ నెల 25న అన్నమయ్య 616వ జయంతి ఉత్సవాలు నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేశామని అకాడమీ డైరెక్టర్ గౌరీభట్ల వసుధామూర్తి చెప్పారు. ఆదివారం నల్లకుంటలో అకాడమి విద్యార్థులకు పునఃశ్చరణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా వసుధామూర్తి జయంతి ఉత్సవాల వివరాలు వెల్లడించారు. మాదాపూర్‌లోని శిల్పారామం అంబి థియేటర్‌లో సాయంత్రం 5 గంటలకు ఉత్సవాలు ప్రారంభమవుతాయని, ముఖ్య అతిథిగా ప్రముఖనటుడు, మోటివేషనల్ స్పీకర్ కేవీ ప్రదీప్‌రావు, యాంకర్, సాఫ్ట్ స్కిల్స్ ట్రైనర్ సరస్వతి ప్రదీప్, ప్రముఖనర్తకి, నటి ఆశ్రిత వేముగంటి, మ్యూజిక్ డైరెక్టర్ డాక్టర్ జ్యోతిభట్ల హాజరవుతారని తెలిపారు. ఈ సందర్భంగా వినూత్న రీతిలో 100 మంది సంగీత, నృత్య కళాకారులతో 'సామూహిక సంకీర్తన'నృత్య రూపకం ఉంటుందన్నారు. డాక్టర్ కనక హర్షిణి, శాలిని అమరనేని కూచిపూడి నృత్య ప్రదర్శనలు ఉంటాయని చెప్పారు. ఆలిండియా రేడియో, టీవీ కళాకారుడు గౌరీభట్ల లక్ష్మణమూర్తి పర్యవేక్షణలో నిర్వహించే ఈ వేడుకలకు వర్ధమాన గాయనీ నందిని, కీ బోర్డ్ ప్లేయర్ యామిని ఈవెంట్ మేనేజర్లుగా వ్యవహరిస్తారని వసుధామూర్తి వివరించారు.

మానవత్వమే 'మతం' పరమార్థం

వెంగళరావునగర్: సమాజంలో ఒకరితో ఇంకొకరు ప్రేమ, ఆప్యాయత, మానవత్వం కలిగి ఉండటమే మతం పరమార్థమని శ్రీవిశ్వ విజ్ఞాన విద్య ఆధ్యాత్మిక పీఠం నిర్వాహకులు (నవమ పీఠాధిపతి) డాక్టర్ ఉమర్ అలీషా పేర్కొన్నారు. పిఠాపురం శ్రీవిశ్వ విజ్ఞాన విద్య ఆధ్యాత్మిక పీఠం ఆధ్వర్యంలో వెంగళరావునగర్ డివిజన్ మధురానగర్ శ్రీసాగి రామకృష్ణం రాజు కమ్యూనిటీ హాల్‌లో ఆదివారం ఆధ్యాత్మిక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ ఉమర్ అలీషా మాట్లాడుతూ... ఆధ్యాత్మికతను ఒక దిక్సూచిగా మార్చుకుని సంసార జీవితంలో వచ్చే ఒత్తిడిలను అధిగమించాలని సూచించారు. మతం అనేది తాత్విక జ్ఞాన మార్గమని.. అది వివిధ గ్రంతాల్లో వివిధ రూపాల్లో (బైబిల్, భగవద్గీత, ఖురాన్)లలో వివరించారని అన్నారు. ప్రకృతి వైపరీత్యాలను అరికట్టాలంటే ప్రతి ఒక్కరూ మొక్కలను నాటాలని ఆయన పిలుపునిచ్చారు. ఆధ్యాత్మికత ద్వారా మనలో ఉండే రాక్షసత్వాన్ని తొలగించి ఆనందకర జీవితాన్ని గడిపే అవకాశం ఉంటుందన్నారు. వివిధ రంగాలకు చెందిన పలువురు ప్రముఖులు, వివిధ కాలనీలకు చెందిన ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

జులై 9న బల్కంపేట ఎల్లమ్మ కల్యాణోత్సవం

సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసానికి ఆహ్వానం



సనత్‌నగర్: భక్తులచే విశేష పూజలు అందుకుంటున్న బల్కంపేట ఎల్లమ్మ అమ్మవారి కల్యాణాన్ని జులై 9న నిర్వహించనున్నారు. ఈ మేరకు ఆలయ చైర్మన్ సాయిబాబాగౌడ్ మాజీ మంత్రి, సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్‌ను కలిసి కల్యాణోత్సవ వివరాలను తెలియజేశారు. వెస్ట్‌మారేడ్‌పల్లిలోని నివాసంలో ఆలయ చైర్మన్‌తో పాటు మాజీ కార్పొరేటర్ ఎన్.శేషుకుమారి, ఆలయ పండితులు ఆయనను అమ్మవారి కల్యాణానికి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆలయ పండితులు వేద మంత్రాలతో ఆశీర్వచనం చేసి తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే తలసాని మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఏర్పడిన తర్వాతనే అమ్మవారి ఆలయం అభివృద్ధి మరింత జరిగిందని ఈ సందర్భంగా గుర్తుచేశారు. అమ్మవారి దర్శనం కోసం వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని వసతులు, సౌకర్యాలు కల్పించామన్నారు. కల్యాణ మహోత్సవాన్ని వివిధ శాఖల అధికారుల సమన్వయంతో అన్ని ఏర్పాట్లు చేసి ఘనంగా నిర్వహిస్తామన్నారు.

వాన పడి.. రోడ్లు నిండి..

కూకట్‌పల్లి జంట సర్కిళ్ల పరిధిలో ఆదివారం మధ్యాహ్నం సమయంలో ఒక్కసారిగా వర్షం పడటంతో రోడ్లు చెరువులను తలపించాయి. రోడ్డు పక్కన ఉన్న షాపుల్లోకి వర్షపునీరు చేరటంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. కూకట్‌పల్లి ఆర్టీసీ డిపోలో వర్షపు నీరు చేరి చెరువును తలపించింది.
– మూసాపేట



కూకట్‌పల్లిలోని ఆర్టీసీ డిపోలో చేరిన వర్షపు నీరు

వర్షం.. ఒక్కసారిగా కురిసిన వైనం



కూకట్‌పల్లి బస్‌స్టాప్ వద్ద రోడ్డుపై ప్రవహిస్తున్న వర్షం నీరు



కూకట్‌పల్లి వై జంక్షన్ వద్ద ఉన్న పెట్రోల్ బంక్ వద్ద నిలిచిన వర్షపునీరు



కూకట్‌పల్లిలో వర్షానికి పొంగిపొర్లుతున్న డ్రైనేజీ



ఇది చెరువు కాదు రోడ్డే..

దుర్గంధం, దుర్వాసనతో ఇబ్బందులు

మోతీనగర్: వర్షపునీటితో పాటు మురుగు తోడవటంతో ఆ ప్రాంతమంతా చిన్నపాటి చెరువును తలపిస్తోంది. మోతీనగర్ మెయిన్ రోడ్డు సమీపంలో కొన్ని రోజులుగా వర్షపునీరు నిలిచిపోయింది. సమీపంలోని అపార్టుమెంట్‌లో డ్రైనేజీ పొంగి రోడ్డుపై చేరుతోంది. నీరు రోడ్డుపై నిలవడంతో రాకపోకలకు ఇబ్బందిగా మారింది. దుర్గంధం, దుర్వాసనతో ఇబ్బందులు పడుతున్నామని స్థానికులు చెబుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.